క్లుప్తంగా

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



సోమవరప్పాడు జంక్షన్ వద్ద కార్లను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

దెందులూరు: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ప్రతి శనివారం మండలంలో పలు గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది వాహనాలను లోపలి వస్తువులను తనిఖీ చేశారు. దెందులూరు, గుండుగొలను, సోమవరప్పాడు, గోపన్నపాలెం, కొవ్వలి వంతెనల వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

బువ్వనపల్లిలో ఎన్నికల ప్రచారం



బువ్వనపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడమర్రు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు ఫ్యాను గుర్తుకే ఓటేయాలని బువ్వనపల్లిలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, పార్టీ అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను, దేవస్థానం చైర్మన్ అల్లుమోలు అంతిర్వేది, పాములపర్తి త్రిమూర్తులు, పసుపులేటి గణపతి, అల్లుమోలు రాంబాబు, మాదాసు బాపూజీ, సంకు నాని, జాలాది రవి, యర్రనాని తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్‌లను తనిఖీ చేసిన ఎస్పీ



ముండూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పెదవేగి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పెదవేగి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ముండూరు గ్రామంలో ఉన్న పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అక్కడ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. అనంతరం పెదవేగి పోలీస్ స్టేషన్లో అధికారులతో ఎన్నికల నియమావళికి సంబంధించిన సమావేశాన్ని ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, శ్రీనివాస్ కుమార్, మల్లేశ్వరరావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దెందులూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని దెందులూరు ఎస్సై కె.స్వామి అన్నారు. శనివారం మండలంలోని గాలాయగూడెం, జోగన్నపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా శ్రీవార్ల కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక అగ్రహారం జనార్దన స్వామి, రంగనాయక స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు జనార్దన స్వామి సుప్రభాత గోష్టి ప్రతినిధుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవా కాలం, ఆరగింపు నిర్వహించారు. మంగళాశాసనాలు పలికి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం అర్చన హోమాదులు, సేవాకాలం, ఆరగింపు నిర్వహించారు. స్వామివార్లకు, అమ్మవార్లకు ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు, తాయార్లకు విశేష అలంకరణ చేశారు. రాత్రి కొనకళ్ల నాగవెంకట సుధాకర్ దంపతులచే పాంచరాత్రాగమ ప్రతిష్ఠ మహాదాచార్య యాజ్ఞిక బ్రహ్మ కొడవటికంటి వెంకట రాజన్ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరనం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణచేశారు. అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేదల స్వగృహానందం

- కాలనీల్లో 1,088 ఇళ్ల నిర్మాణం పూర్తి
- 15 గ్రామాల్లో రూ.12.77 కోట్లు అందజేత



ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల్లో స్వగృహానందం వెల్లువిరుస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు ఎందరో సొంతిల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నారు. దీనికి కారణం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలపడమే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హౌసింగ్ శాఖకు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేస్తున్నారు. 2023 నవంబర్ నెలాఖరి నాటికి ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 1088 మంది సొంతిల్లు నిర్మించుకున్నారు. వీరికి ప్రభుత్వం రూ.12,77,81,000 అందజేసింది. గ్రామాల వారీగా చాటపర్రులో రూ.2,96,35,873, పైడిచింతపాడు రూ.81,96,482, ప్రత్తికోళ్లలంక రూ.1,25,93,456, కేదీపురం రూ.32,81,459, కోమటిలంక రూ.26,12,393, శ్రీపర్రు రూ.1,09,08278, పెదయాగనమిల్లి రూ.15,00,000, గుడివాకలంక రూ.6,54,6651, జాలిపూడి రూ.2,02,21,461, మల్కాపురం రూ.1,91,57,344, మాదేపల్లి గ్రామంలో రూ.1,31,28,091 ప్రభుత్వం అందజేసింది.



శనివారపుపేట జగనన్నకాలనీలో ఓ మహిళ నిర్మించుకున్న ఇల్లు



చాటపర్రులో ఓ ఇంటి ఎలివేషన్‌పై రూపొందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం

నాలుగు దశల్లో నగదు మంజూరు

ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు అధికారులు క్రమంతప్పకుండా నిధులు మంజూరు చేస్తున్నారు. కాలనీల వద్దకే ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచుతున్నారు. పనులు ప్రారంభం కాగానే బేస్‌మెంట్ లెవెల్‌లో రూ.70 వేలు, రూఫ్‌లెవెల్‌లో రూ.37,600, రూఫ్ కాస్ట్ రూ.21,200, నిర్మాణం పూర్తయ్యే దశలో రూ.21,200 లబ్ధిదారులు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీనికితోడు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతనం రూ.30 వేలు అందిస్తున్నారు. మరో రూ.30 వేలు డ్వాక్రా సంఘాల నుంచి అప్పుగా ఇప్పిస్తున్నారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ

ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ అధికారులతో పాటు మండల పరిషత్, ఇంజినీరింగ్ శాఖాధికారులతో పాటు సచివాలయ సిబ్బంది సైతం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లబ్ధిదారులను కలుసుకుని వారికి అవసరమైన రోడ్లు, నీటి వసతులు కల్పిస్తున్నారు.



జాలిపూడి జగనన్నకాలనీలో నిర్మించిన ఇళ్లు

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుణ్యంతో మా సొంతింటి కల నెరవేరింది. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం మా గోడు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ పాలనలో మాకు ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. వెంటనే ఇంటి పని ప్రారంభించాం. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది. నాలాంటి పేదలు ఎందరో జగనన్నకాలనీలో ఇళ్లు కట్టుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతతోనే నా ఇంటిపై జగన్ మోహన్‌రెడ్డి చిత్రం వేసుకున్నాను.

– గండి బాలు, కోటేశ్వరదుర్గాపురం

మౌలిక వసతులు కల్పించాం



కొల్లేరు గ్రామాల్లో పేదలు ఇళ్లు కట్టుకోవాలంటే ఎంతో వ్యయమయ్యేది. కొల్లేరు ముంపుబారిన పడిన ప్రతిసారీ పేదల ఇళ్లు నీట మునిగిపోయేవి. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకాలనీలో ఇళ్ల స్థలాలను లక్షల రూపాయలు ఖర్చుచేసి మెరక చేశారు. పేదలు ఇప్పుడు ధైర్యంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. కాలనీల్లో రోడ్లు నిర్మించారు. నిర్మాణ పనుల కోసం బోర్లు వేసి, వాటర్ సప్లై చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి అందరికీ విద్యుత్ ఇచ్చారు. అందుకే పేదలు సంతోషంగా ఇల్లు కట్టుకున్నారు.

– ముంగర తిమోతి, పైడిచింతపాడు, సర్పంచ్

రైల్వే, డిఫెన్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైల్వే, డిఫెన్స్ ఉద్యోగాలకు సిద్ధమౌతున్న అభ్యర్థులకు తమ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నగరానికి చెందిన ఫ్యూచర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సతీష్ సావిత్రి సరేళ్ల తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం రోడ్డులోని సీఎస్ఐ స్కూల్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ తరగతులను 6 నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించామన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 81439 74622లో సంప్రదించాలని సంస్థ కార్యదర్శి హుస్సేన్ కోరారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాణాల శంకరరావు, జిల్లా ఎన్‌జీఓ నాయకుడు చోడగిరి శ్రీనివాస్, వైమానిక దళ మాజీ అధికారి కసుకుర్తి లక్ష్మయ్య మాట్లాడారు.

కలపర్రు టోల్‌గేట్ వద్ద తనిఖీలు

పెదపాడు: కలపర్రు టోల్‌గేట్ వద్ద ఎస్సై శుభశేఖర్ రెవెన్యూ అధికారులతో కలిసి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ప్రజలు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లకూడదని వివరించారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

లబ్ధిదారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కృషి



భీమడోలు : ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు



పాతూరులో బేబీలకు బహుమతులు అందిస్తున్న సూపర్‌వైజర్ షహనాజ్‌బేగం

భీమడోలు: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో అంగన్‌వాడీలు భాగస్వామ్యులు కావాలని భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కేవీ విజయలక్ష్మి అన్నారు. భీమడోలు, పాతూరు గ్రామాల్లో పోష్టికాహార పక్షోత్సవాల వేడుకలు శనివారంతో ఘనంగా ముగిశాయి. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని భుజించడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. భీమడోలులో అంగన్‌వాడీ కేంద్రంలోని లబ్ధిదారులతో చిరుధాన్యాల అవశ్యకతను తెలియజేస్తూ ప్రదర్శన చేశారు. పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ బేబీ షో కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారుల్లో వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు, ఆహారాన్ని పరిగణనలోకి తీసుకుని ఉత్తమ బేబీలను ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ ఎండీ షహనాజ్‌బేగం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చిరుధాన్యాలతో తయారీ చేసిన ఆహార పదార్థాలతో పాటు చిరుధాన్యాలను ప్రదర్శించారు. పీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లోని లబ్ధిదారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని భుజించడం ద్వారా బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. కాల్షియం, ఫైబర్, అంటీ యాక్సిడెంట్స్, రక్తంలో చెక్కర శాతం తగ్గుతుందని, పిండి పదార్థాలు, మాంసపుకృత్తులు పుష్కలంగా ఉంటాయని వివరించారు. బలహీనంగా ఉన్నవారంతా చిరుధాన్యాలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. వాటిపై ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్కే నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల కమిటీ నియామకం

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల కమిటీని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. పార్టీ మండల అధ్యక్షుడిగా సంకు సత్యకుమార్, ప్రధాన కార్యదర్శిగా మంత్రిబుద్ధి చిన్నఅప్పారావు, అఫిషియల్ స్పోక్స్‌పర్సన్స్ వంజరపు నాగసత్యనారాయణ, రెడ్డికోట సత్యవతి, కార్యదర్శులుగా పుప్పాల సుబ్బారావు, పట్టపు వరప్రసాద్, కోశాధికారిగా వంకాయల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బొబ్బిలి వెంకటేశ్వరరావు, శనపతి వెంకటరమణ, వి.శ్యామలాదేవి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఆవులగడ్డ ఆషారూప బాలసత్యశ్రీ, బయ్యే మరియమ్మ, రాయుడు కాంతమ్మ, దారాబత్తుల సరయ్యలను నియమించింది.

చర్చి కూల్చివేత వార్తలు అవాస్తవం

దెందులూరు: గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఏలూరులోని గొల్లాయగూడెం మన్నా చర్చి కూల్చివేత పై వస్తున్న విభిన్నమైన కథనాలు అవాస్తవమని ఫాదర్లు అన్నారు. శనివారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాల ఆవరణలో విలేకరులతో పాస్టర్లు మాట్లాడుతూ చర్చి కూల్చివేత విషయంలో సోషల్ మీడియాలో వస్తున్నట్లుగా మత సంబంధ సమస్యలేమీ లేవని, పట్టణంలో ప్రజలంతా ప్రేమ, సేవ, పరస్పర సహాయ సహకారాలతో, ఐక్యతతో, శాంతియుతంగా జీవిస్తున్నామన్నారు. ఎవరైనా సరే ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచారం చేస్తే నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ బుద్దుల అబ్రహం, ఫాదర్ బాల, ఫాదర్ ఐ.మైకేల్, పాస్టర్లు పీవీ రాజు, టి.శ్యాం బాబు, సుదర్శన బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివ, కేశవుల కల్యాణోత్సవం



భీమడోలులో శివ, కేశవ కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



వేంకటేశ్వర స్వామి కల్యాణ తంతును తిలకిస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలులో అతిపురాతన ఆలయాలు పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. శివ, కేశల కల్యాణం ఒకే మహూర్తానికి ఒకే వేదిక వద్ద వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయాల్లో వేంచేసియున్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి వార్ల వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతాయి. విద్యుత్ దీపాలతో అలంకరించిన శివాలయం సెంటర్ వద్ద ఉన్న మండలపాల వద్ద స్వామి వార్ల కల్యాణ తంతు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు గోవిందా గోవిందా, శివ నామస్మరణతో వేదిక ప్రాంగణమంతా మార్మోగింది. శివ, కేశవులను విశేషంగా అలంకరించి ముస్తాబు చేశారు. తొలుత పార్వతీ సమతే భీమేశ్వర స్వామిని, వేంకటేశ్వర స్వామి ఆలివేలు మంగ, లక్ష్మీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పరిణయం పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ కల్యాణ తంతు ఘనంగా జరిగింది. పలువురు దంపతులు పీటలపై ఆశీన్సులయ్యారు. శివ, కేశవ కల్యాణం ఒకే ముహూర్తానికి ఒకే వేదికపై తిలకించడం తమ అదృష్టమని భక్తులు పేర్కొన్నారు. అర్చకులు అగ్నిహోత్రం నరసింహాచార్యులు, కాళ్లకూరి ఉమాశంకర శర్మ, బృందావనం శేషాభట్టాచార్యులు విశేష పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ ఘట్టాన్ని తిలకరించారు.

రూ.6 కోట్లతో శ్రీరామవరం అభివృద్ధి



శ్రీరామవరంలో నేను సిద్ధం-మా ఊరు సిద్ధం కార్యక్రమంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహాయ సహకారాలతో కులం, మతం, పార్టీ, వర్గం అనే భేదాలు లేకుండా శ్రీరామవరం గ్రామంలో రూ. 6 కోట్లుతో పలు అభివృద్ధి పనులు చేశామని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని అన్నారు. శనివారం రాత్రి గ్రామంలో కామిరెడ్డి నాని, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు అక్కినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేను-మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ మధ్యవర్తులు ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ ప్రజల బ్యాంకు అకౌంట్‌లో ప్రభుత్వం నేరుగా రూ.10 కోట్లు వివిధ సంక్షేమ పథకాల రూపంలో జమ చేసిందని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ గ్రామంలో ఏం చేశారో? చెప్పే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. అనంతరం నాయకులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పొత్తుల పేరుతో ఎవరు, ఎవరితో కలిసినా, ఎవరు ఎవరితో పోటీ చేసినా, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గణాంకాలతో జరిగిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనుమూరిసావిత్రి, నాయకులు కామిరెడ్డి బాలు, మామిడి రాము, మామిడి రాంబాబు, నీలాపు గిరి, కొత్తపల్లి శ్రీను, కొత్తపల్లి గోపిరాజు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



నిడమర్రులో వాహన తనిఖీ చేస్తున్న పోలీసులు

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు, ఎన్నికల అధికారులు (ఎఫ్ఎస్‌టీ) టీమ్‌లు వాహన తనిఖీలను ముమ్మరం చేశాయి. శనివారం నిడమర్రు మండలంలో చెక్‌పోస్టులు, ఇతర కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఓటర్లును ప్రలోభ పెట్టేందుకు డబ్బు మద్యం ఇతరత్రా తరలించే వారిపై నిఘాపెట్టామని ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాడు బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు.

నూతన ఆలయ ప్రతిష్టాపనోత్సవం



రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు

పెదపాడు: మండలంలోని సత్యవోలు గ్రామంలో ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టాపనోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వరకు నిర్వహించే ప్రతిష్టాపనోత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతిష్టాపనోత్సవ ప్రారంభం సందర్భంగా ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు రంభ నాగరాజు, బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, గండివలస బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్

పెదవేగి: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని పెదవేగి ఎంఈఓ సీహెచ్ బుద్ధవ్యాస్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కొండలరావుపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమంగా ఉన్నాయని అన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం వీఎం కిరణ్మయి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బి.ప్రమీల, ఎస్ఎంసీ సభ్యుడు టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముగ్గురమ్మల జాతర



మహాలక్ష్మి



మహంకాళి



బంగారుపాప

గణపవరం: గణపవరం మండలం పిప్పర గ్రామ దేవతలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి 27 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ ప్రకటించింది. పిప్పర పరిసర గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా భావించే మహాలక్ష్మి, మహంకాళి, బంగారుపాపమ్మల జాతర మహోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం రాత్రి అమ్మవార్ల గవళ్లగుడుపు సేవ వైభవంగా నిర్వహిస్తారు. తెల్లవార్లూ గ్రామంలో వీధివీధినా ఊరేగిస్తారు. విచిత్రవేషాలు, బుట్టబొమ్మలు, శక్తి వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా మోతలతో అమ్మవార్ల జాతర అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకు రంగులువేసి ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గ్రామానికి ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామం కళకళలాడుతోంది.

జగనన్నతోనే సామాజిక న్యాయం



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మున్నల జాన్‌గురునాథ్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారితకు పెద్దపీట వేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ రంగంలో అత్యధిక ప్రాధాన్యత కల్పించారని, ఆయనతోనే దళిత, బహుజనులకు న్యాయం చేకూరుతుందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఏలూరు నగర కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా సామాజిక న్యాయం చేసి చూపించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. డిప్యూటీ మేయర్లు శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు పాల్గొన్నారు.